## రెండవ పాఠం
## తౌహీదె ఉలూహియత్

## الدرس الثاني
## توحيد الألوهية

(2) **తౌహీదె ఉలూహియత్** అంటేః సర్వ రకాల ఆరాధన అద్వితీయుడైన అల్లాహ్ కు మాత్రమే చేయుట. ఏ మానవుడూ పూజా చేయుటకు మరియు సాన్నిధ్యము పొందుటకు అల్లాహ్ తో మరెవ్వరినీ సాటి కల్పించకూడదు. తౌహీద్ యొక్క మూడు రకాల్లో ఇదే అతిముఖ్య మైనది, చాలా గొప్పది.

దీని కొరకే అల్లాహ్ మానవులను సృష్టించాడు. అల్లాహ్ ఆదేశం గమనించండి:

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ﴾ [الذاريات:٥٦]

**{నేను మానవులను, జిన్నాతులను కేవలం నన్ను ఆరాధించుటకే పుట్టించాను}. (జారియాత్ 51: 56).**

దీని కొరకే అల్లాహ్ ప్రవక్తలను పంపాడు, గ్రంథాలను అవతరింపజేశాడు. అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

﴿وَمَا أَرْسَلْنَا مِنْ قَبْلِكَ مِنْ رَسُولٍ إِلَّا نُوحِي إِلَيْهِ أَنَّهُ لَا إِلَهَ إِلَّا أَنَا فَاعْبُدُونِ﴾ [الأنبياء:٢٥]

**{మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా 'నేను తప్ప వేరు నిజ ఆరాధ్యుడు మరొకడు లేడు, కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి' అనే విషయాన్ని తెలియజేశాము}. (అంబియా 21: 25).**

దీనినే (ఈ తౌహీదె ఉలూహియత్ నే) గత జాతివారు తిరస్కరించారు, వారి ప్రవక్తలు దీని గురించి వారికి బోధించినప్పుడు. దీనికి ఖుర్ఆన్ ఇలా సాక్ష్యమిస్తుంది:

﴿قَالُوا أَجِئْتَنَا لِنَعْبُدَ اللهَ وَحْدَهُ وَنَذَرَ مَا كَانَ يَعْبُدُ آبَاؤُنَا فَأْتِنَا بِمَا تَعِدُنَا إِنْ كُنْتَ مِنَ الصَّادِقِينَ﴾ [الأعراف:٧٠]

**{(బహుదైవారాధకులు తమ ప్రవక్తలకు ఇలా జవాబిచ్చారు): నీవు మా వద్దకు రావటానికి కారణం, మేము ఒక్క అల్లాహ్ నే ఆరాధించాలనా, మా తాత ముత్తాతలు పూజిస్తూ వచ్చిన వాటిని విసర్జించాలనా?}. (ఆరాఫ్ 7: 70).**

అందుకే ఇబాదత్ (ఆరాధన) యొక్క ఏ రకము కూడా అల్లాహ్‌యేతరులకు చేయుట ఎంత మాత్రం సమంజసం కాదు. ఆ అల్లాహ్ యేతరులు ఎవరైనా సరే: అతిసన్నిహితులైన దైవదూతలు, ప్రవక్తలు, మహా భక్తులు, సృష్టిరాసుల్లో ఎవ్వరినీ కూడా అల్లాహ్ తో సాటి కల్పించకూడదు. ఎందుకనగా కేవలం అల్లాహ్ కొరకు చేయబడిన ఆరాధనే (ఇబాదతే) నిజమైనది.